సాక్షి
కామారెడ్డి
గురువారం । 15 । ఆగస్టు । 2024



బాధ్యత నాదే
ఎన్‌బురా గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయిస్తానని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు హామీ ఇచ్చారు.
- IIలో ▸



అప్రమత్తంగా ఉండండి
సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.
- IIIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
39.0 /23.5

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఎండతీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

గవర్నర్‌ను కలిసిన కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్



కామారెడ్డి టౌన్: రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని రాజ్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, సన్మానించారు.

'ఆధార్ నమోదు తప్పనిసరి'



నిజాంసాగర్: యూరియా, కాంప్లెక్స్ ఎరువులకోసం వచ్చే రైతుల ఆధార్ నంబర్‌ను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి సూచించారు. బుధవారం నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు మోతాదుకు మించి మందులు వాడవద్దన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి అమర్ ప్రసాద్, ఫర్టిలైజర్ నిర్వాహకులు ప్రీతి, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు సన్మానం



కామారెడ్డి క్రైం: ఇటీవల కోల్‌కతాలో జరిగిన ఆసియా చేస్ బాక్సింగ్ చాంపియన్ షిప్, ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ చెస్ బాక్సింగ్ టోర్నీల్లో సత్తా చాటిన క్రీడాకారులను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అభినందించారు. చెస్ బాక్సింగ్ సీనియర్ మహిళా విభాగంలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన పిట్లంకు చెందిన తక్కడ్‌పల్లి ప్రతిభ 5 గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్ మెడల్, సీనియర్ పురుషుల విభాగంలో పిట్లంకే చెందిన తక్కడ్‌పల్లి విజయ్ రాఘవేంద్రరావు రెండు సిల్వర్ మెడల్స్ సాధించిన విషయం తెలిసిందే. వీరిద్దరు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. వారిని కలెక్టర్ సన్మానించారు.

క్లైమేట్ స్మార్ట్ గ్రీన్ క్యాంపస్ క్లబ్ ప్రారంభం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో క్లైమేట్ స్మార్ట్ గ్రీన్ క్యాంపస్ క్లబ్ ఏర్పాటు కావడంపై ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం కళాశాల వృక్షశాస్త్ర, అటవీశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో క్లైమేట్ స్మార్ట్ గ్రీన్ క్యాంపస్ క్లబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు, వాటి ప్రభావం, ప్రకృతి వైపరీత్యాలు, అతివృష్టి, అనావృష్టి, కొండచరియలు విరిగిపడడం, భూకంపాలు, ఆకస్మికంగా జరిగే ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి పర్యావరణాన్ని కాపాడడమే ఈ క్లబ్ ఉద్దేశమన్నారు. క్లబ్‌లో నేర్చుకున్న విషయాలను ప్రజలకు వివరించాలని వృక్షశాస్త్ర విభాగ అధిపతి దినకర్ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, అధ్యాపకులు స్వాతి, శ్రీలత, సుచరణ్, ప్రవీణ్‌నాయక్, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రి కోసం ప్రతిపాదనలు

కామారెడ్డి టౌన్: దోమకొండ సీహెచ్‌సీని 30 పడకల నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయడానికి ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టీనా జెడ్ చోంగ్తూకు బుధవారం ప్రతిపాదనల లేఖను అందించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సిఫారుసు మేరకు దోమకొండ సీహెచ్‌సీని 100 పడకల ఆస్పత్రిగా మార్చాలని లేఖలో కోరారు. అలాగే జెడ్పీ తీర్మానం, ఆస్పత్రి నూతన భవనం కోసం పంచాయతీ నాలుగు ఎకరాలను కేటాయించడం, తెలంగాణ ఎంఎస్‌ఐడీసీ ప్రతిపాదనలు, వైద్యులు, సిబ్బంది పోస్టుల వివరాలను ఆ ప్రతిపాదనలలో పొందుపరిచారు.

అభాగ్యులకు దిక్కెవరు?

వారు ఎవరికీ పట్టని అభాగ్యులు.. అనారోగ్యంతో కొందరు, మతిస్థిమితం లేక మరికొందరు బాధపడుతూ ఏ ఆసరా లేక నరకాన్ని అనుభవిస్తున్నారు. ఎవరైనా దయతలిస్తేనే వారి కడుపునిండేది.. లేదంటే పస్తులే.. ఏ ఆశ్రయం లేక, ఎక్కడ తల దాచుకోవాలో తెలియక.. పగటి పూట చెట్ల కింద, రోడ్లపైన.. రాత్రయితే దుకాణాల అరుగుల మీద సేదదీరుతున్న వీరిని అధికారులు సైతం పట్టించుకోవడం లేదు.

- జిల్లా కేంద్రంలో వంద మందికిపైనే నిరాశ్రయులు
- పగలు చెట్ల కింద.. రాత్రి దుకాణాల అరుగులపై..
- ఎవరైనా దయతలిస్తేనే కడుపునిండేది.. లేకపోతే పస్తులే
- పట్టించుకోని అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: దేశానికి స్వాతంత్య్రం వచ్చి 78 ఏళ్లయినా పేదల బతుకుల్లో మార్పు రావడం లేదు. ఎంతో మంది ఇప్పటికీ పట్టెడు అన్నం కోసం అవస్థలు పడుతున్నారు. ఉండడానికి కనీసం గుడిసెలు కూడా లేని పరిస్థితుల్లో రోడ్ల వెంట జీవనం సాగిస్తున్నారు. జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలో ఎక్కడెక్కడి నుంచో వచ్చిన అనాథలు, నిరుపేదలు వంద మందికిపైగా ఉన్నారు. ఇందులో కొందరు అనారోగ్యంతో బాధపడుతుండగా.. మరికొందరు మతిస్థిమితం లేక ఏ పనీ చేయలేకపోతున్నారు. రోడ్లవెంట, రైల్వే స్టేషన్ పరిసరాల్లో సంచరిస్తుంటారు. ఇళ్లు, హోటళ్ల వెంట తిరిగి, ఎవరైనా దయతలచి అన్నం పెడితే కడుపు నింపుకుంటారు. లేదంటే రైల్వే స్టేషన్‌లో నీళ్లు పట్టుకుని తాగి చెట్ల కింద సేదతీరుతారు. రాత్రి వేళలో పలువురు దాతలు అన్నం ప్యాకెట్లు తీసుకుని వచ్చి వీరికి అందిస్తారు. దీంతో ఆ పూట గడుస్తుంది. మరుసటి రోజు ఎవరైనా దయ తలుస్తారేమోనని ఆశగా ఎదురుచూస్తుంటారు. ఆలనాపాలనా చూసేవారు లేక, ఆశ్రయం లేక, తినడానికి తిండి దొరక్క చాలామంది అవస్థలు పడుతున్నారు. వానకు నానుతూ, ఎండకు ఎండుతూ, చలికి వణుకుతూ దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు.



కామారెడ్డి రైల్వే స్టేషన్ ఆవరణలో దాతలు అందిస్తున్న ఆహారంతో కడుపు నింపుకుంటున్న పేదలు



రాత్రి వేళ రైల్వే స్టేషన్ రోడ్‌లోని దుకాణాల మెట్ల మీద నిద్రిస్తూ..

బాధ్యత బల్దియాదే!

అనాథలు, నిరాశ్రయులకూ బతికే హక్కు కల్పించాలని సుప్రీంకోర్టు గతంలో సూచించింది. పట్టణాలు, నగరాల్లో రాత్రి బస కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలను ఆదేశించింది. ప్రతి కేంద్రంలో నీరు, ఆహారం, మరుగుదొడ్లు, పడుకునేందుకు వసతి కల్పించాలని సూచించింది. వీటిని మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. అనాథలకు ఆవాసం కల్పించి, వారికి ఇంత తిండి పెట్టించాల్సిన బాధ్యత కూడా మున్సిపాలిటీదే.. పట్టణంలో ఎక్కడో ఒకచోట వారికి ఆవాసం ఏర్పాటు చేసి, వారు ఉండడానికి ఆశ్రయం ఇవ్వడంతో పాటు ఆకలి తీర్చాలి. అయితే ఏ ఆశ్రయం లేక రోడ్ల మీద, దుకాణాల వద్ద సేదతీరుతున్న వీరిని అధికార యంత్రాంగం పట్టించుకున్న పాపాన పోవడం లేదు. జిల్లా అధికారులు స్పందించి అనాథలు, అభాగ్యుల గురించి ఆలోచించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

దుకాణాల ముందు..

ఏ ఆశ్రయం లేనివారికి దుకాణాల ఆవరణలే దిక్కవుతున్నాయి. రాత్రి వేళ వ్యాపారులు తమ వ్యాపారాలు ముగించుకుని దుకాణాలకు తాళాలు వేసి వెళ్లిపోగానే అనాథలు, అభాగ్యులంతా ఆ దుకాణాల దగ్గరకు చేరుకుంటారు. దుకాణాల అరుగుల మీద నిద్రకు ఉపక్రమిస్తారు. గతంలో రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని షెడ్డులో పడుకునేవారు. స్టేషన్ ఆధునికీకరణ పనులతో షెడ్డును కూల్చివేయడంతో వారికి ఆవాసం కరువైంది. పగటి పూట ఎక్కడో ఒకచోట, చెట్ల కింద పొద్దు గడిపే వారంతా రాత్రి మాత్రం దుకాణాల దగ్గరకు చేరుకుంటారు. ఉదయమే మేల్కొని చెట్ల కిందికి వెళ్లిపోతారు.



రాత్రి వేళలో దుకాణాల వద్ద సేదదీరుతూ..

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: నిజామాబాద్ నాగారంలోని డైట్ కాలేజీలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో ఫిలాసఫీ, సోషియాలజీ, గణిత శాస్త్ర బోధన పద్ధతులు, సాంఘిక శాస్త్ర బోధన పద్ధతులు, వ్యాయామ విద్య, కళా విద్యలలో ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఉర్దూ విభాగంలో ఫిలాసఫీ, సోషియాలజీ, సామాన్య, గణిత, సాంఘిక శాస్త్రాల బోధన పద్ధతులు, ఉర్దూ బోధన పద్ధతులలో ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి, అర్హత గలవారు ఈనెల 21వ తేదీలోపు డైట్ కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని, ఇతర వివరాలకు 91774 21285 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

20న కామారెడ్డి బంద్



కామారెడ్డి టౌన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈనెల 20న కామారెడ్డి బంద్‌కు పిలుపునిచ్చినట్లు కామారెడ్డి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. 20వ తేదీ ఉదయం 9 గంటలకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని జేపీఎన్ విగ్రహం వద్ద ప్రారంభమయ్యే ర్యాలీ పట్టణంలో ప్రధాన వీధుల మీదుగా కలెక్టరేట్ వరకు సాగుతుందన్నారు. బంద్‌కు పట్టణ వర్తక, వాణిజ్య, వ్యాపార సంఘాలు, అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కంచర్ల లింగం, కార్యదర్శి సుకుమార్‌గౌడ్, కోశాధికారి గడీల నర్సింలు, ప్రతినిధులు రవీందర్, గౌరీశంకర్, శ్రీనివాస్, కుంబాల రవి, మోటూరి శ్రీకాంత్, ఆనంద్, కైలాస్ సంతోష్, మారుతి, నరేష్, మధు, రాజేందర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఏఎస్సైకి ఇండియన్ పోలీస్ మెడల్

కామారెడ్డి క్రైం: కామారెడ్డి రైల్వే ఔట్‌పోస్టులో ఆర్‌పీఎఫ్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న ఏఎస్సై జె.సుధాకర్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆయన స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా ప్రకటించిన ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యారు. సుధాకర్ 33 ఏళ్లుగా క్రైం ఇన్వెస్టిగేటర్‌గా పనిచేస్తున్నారు. రైల్వేలో అనేక నేరాలను పరిష్కరించారు. చోరీ అయిన రైల్వే ఆస్తులు, ప్రయాణికుల వస్తువులను గుర్తించడంలో దిట్టగా పేరుపొందారు. 2018లో ప్రయాణికుల సామాన్లు దొంగలించిన హర్యానా గ్యాంగ్‌ను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించారు. 2019, 2020లలో ప్రయాణికుల సామాన్లు దొంగిలించిన 14 నేరాల్లో దాదాపు రూ. 12 లక్షల సొత్తును రికవరీ చేశారు. సికింద్రాబాద్ డివిజన్‌లో దర్యాప్తు బృందాలలో సభ్యుడిగా ఉండి 393 మంది నేరస్తులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. అంతేకాకుండా వందల సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి చేశాడు. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపిక చేసింది. ఈ విషయాన్ని కామారెడ్డి రైల్వే ఎస్సై తావూనాయక్ బుధవారం తెలిపారు. అవార్డుకు ఎంపికైన సుధాకర్‌ను అభినందించారు.



ఎంపికైన జే.సుధాకర్

ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్యుల నిరసన

కామారెడ్డి టౌన్: కోల్‌కతాలో వైద్య విద్యార్థిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ బుధవారం కామారెడ్డిలో ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్యులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వైద్యులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు రమణ, ప్రధాన కార్యదర్శి పవన్, వైద్యులు అరవింద్, విజయలక్ష్మి, అశ్విన్, రమేష్‌బాబు, మారుతిబాబు తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఐఎంఏ ప్రతినిధులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- డెంగీ బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- లక్ష్మీరావులపల్లి గ్రామ సందర్శన



పీహెచ్‌సీలో వైద్యాధికారితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, డీఎంహెచ్‌వో



లక్ష్మీరావులపల్లిలో పర్యటిస్తున్న కలెక్టర్ సంగ్వాన్, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మాచారెడ్డి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. విజృంభిస్తున్న డెంగీ శీర్షికన 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనంపై కలెక్టర్ స్పందించారు. ఆయన డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, డీపీవో శ్రీనివాస్‌రావు, డీఎల్‌పీవో శ్రీనివాస్‌లతో కలిసి బుధవారం మాచారెడ్డి మండలంలో పర్యటించారు. లక్ష్మీరావులపల్లిలో ఇంటింటికి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. ఎప్పటికప్పుడు గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి ఆస్మా బేగంను ఆదేశించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. డెంగీ బారినపడి కోలుకున్న వారింటికి వెళ్లి క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.

పీహెచ్‌సీ తనిఖీ..

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ముందుగా మాచారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆపరేషన్ థియేటర్, ఇన్ పేషంట్ వార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఎలాంటి మందులున్నాయి, ఏయే వ్యాధులు సోకిన వాళ్లు వస్తారని ప్రశ్నించారు. జ్వరం, వాంతులు, విరేచనాలతో బాధపడేవారు పీహెచ్‌సీకి వస్తారని వైద్యాధికారి ఆదర్శ్ తెలిపారు. అనంతరం బీసీ వసతి గృహాన్ని సందర్శించి అక్కడ ఉన్న సదుపాయాల గురించి వార్డెన్ చక్రధర్‌ను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్ చెప్పిన వివరాలతో సంతృప్తి చెందిన కలెక్టర్.. వార్డెన్‌ను అభినందించారు.

16కు చేరిన డెంగీ కేసులు..

ఉమ్మడి మాచారెడ్డి మండలంలో డెంగీ కేసులు 16కు చేరాయి. లక్ష్మీరావులపల్లిలో 13, పాల్వంచలో రెండు, భవానీపేటలో ఒక కేసు నమోదయ్యాయి. లక్ష్మీరావులపల్లిలో పదేళ్ల బాలుడు డెంగీ బారిన పడడంతో అతడిని జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

మువ్వన్నెల వేడుకకు ముస్తాబు

- ఇందిరాగాంధీ స్టేడియంలో స్వాతంత్య్ర దినోత్సవాలు
- ముఖ్య అతిథిగా పాల్గొననున్న టూరిజం కార్పొరేషన్ చైర్మన్ రమేశ్‌రెడ్డి
- భారీ ఎత్తున ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం



ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాట్లు



విద్యుత్ దీపకాంతుల్లో కలెక్టరేట్ సముదాయం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: స్వాతంత్య్ర దినోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. గురువారం ఉదయం జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియం వేదికగా వేడుకలను నిర్వహించనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి నిర్వహిస్తున్న స్వాతంత్య్ర దినోత్సవం కావడంతో.. ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వంనుంచి వచ్చిన ఆదేశాల మేరకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఏర్పాట్లు చేయించారు. ఇందుకోసం ఆయన వారం రోజులుగా అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. లోటుపాట్లకు ఆస్కారం లేకుండా, ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. దీంతో ఆయా శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్‌తో పాటు శకటాలను తయారు చేయించారు. అలాగే ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బంది జాబితాను రూపొందించి వేడుకల సందర్భంగా సన్మానించడానికి ఏర్పాట్లు చేశారు. ఈసారి పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నారు. వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి హాజరుకానున్నారు. ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం పోలీసులనుంచి గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. జిల్లా ప్రగతిపై ప్రసంగిస్తారు. ఆ తర్వాత జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శన, అవార్డుల ప్రదానం కార్యక్రమాల్లో పాల్గొంటారు.

'నెహ్రూ స్వార్థం వల్లే దేశం ముక్కలయ్యింది'

కామారెడ్డి టౌన్: జవహర్‌లాల్ నెహ్రూ అనుసరించిన స్వార్థ రాజకీయ విధానాల వల్లే ఆనాడు దేశం రెండు ముక్కలయ్యిందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో దేశ విభజన గాయాల స్మారక దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి కావాలన్న ఉద్దేశంతోనే నెహ్రూ ఆనాడు దేశ విభజనకు అంగీకరించారన్నారు. దేశ విభజన సమయంలో లక్షలాది హిందువులు ఊచకోతకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న విభజన రాజకీయాలు దేశానికి ప్రమాదకరమని విమర్శించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండించారు. దేశ విభజన సమయంలో చనిపోయిన వారికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్, కౌన్సిలర్లు శ్రీకాంత్, శ్రీనివాస్, నరేందర్, నాయకులు సంతోష్‌రెడ్డి, వెంకట్, వేణు, సంధ్య, అనిత, నరేశ్, రఘు, రజనీకాంత్, రవీందర్, గంగాధర్, గోవర్ధన్, విజయ్, రాజగోపాల్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార

ఘనంగా అఖండ భారత్ సంకల్ప దినోత్సవం



కామారెడ్డి అర్బన్: ఆంగ్లేయులు పాలించకముందు భారతదేశం అఖండ భారత్‌గా ఉండేదని, వలసపాలన కుట్రలతో విభజించు పాలించు సిద్ధాంతంతో దేశం 8 ముక్కలైందని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నిత్యానందం అన్నారు. వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి స్థానిక భవానీరోడ్డు, ఈశ్వర్‌పుర వీధిలో అఖండ భారత్ సంకల్ప దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బ్రిటిష్ పాలన కుట్రలతో అఖండ భారత దేశం ఆఫ్ఘనిస్తాన్, నేపాల్, భూటాన్, టిబెట్, శ్రీలంక, బర్మా, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌గా విడిపోయి ఖండిత భారత్‌గా మారిందని నాయకులు అన్నారు. దేశభక్తి గీతాలు, హనుమాన్ చాలీసా పారాయణం, భజనలు, కీర్తనలు పాడారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి బొల్లి రాజు, నగర అధ్యక్షుడు వడ్ల వెంకటస్వామి, జిల్లా సేవా ప్రముఖ్ కొమి రెడ్డి అజయ్, బజరంగ్ దళ్ సంయోజక్ వివేకానంద అశోక్, ప్రతినిధులున్నారు.

ఇసుకాసురుల బెదిరింపులు

- ట్రాక్టర్లను అడ్డుకుంటే ఢీకొట్టి చంపేస్తాం
- గతంలో వీఆర్‌ఏను ఢీకొట్టిన ఘటన గుర్తుందా ?
- మా నెట్‌వర్క్ చాలా పెద్దది అంటూ ఇసుక మాఫియా హెచ్చరికలు
- తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన రెవెన్యూ సిబ్బంది



బిచ్కుంద(జుక్కల్): మండలంలోని మంజీరా పరివాహక ప్రాంతాలు ఖద్‌గాం, శెట్లూర్, హజ్గుల్, పుల్కల్ గ్రామాల నుంచి ప్రతి రోజు రాత్రి సమయంలో అక్రమంగా వందల ట్రాక్టర్లలో ఇసుకను తరలించి ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. అక్రమ రవాణాను అరికట్టడానికి రెవెన్యూ అధికారులు మంజీరా నది వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ట్రాక్టర్లను అడ్డుకుంటే ఢీకొట్టి చంపేస్తామని ఇసుక మాఫియా బెదిరించడంతో రెవెన్యూ అధికారులు భయాందోళన చెందుతున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాలతో మండల తహసీల్దార్ సురేష్ అక్రమ రవాణను అరికట్టడానికి ఆయా గ్రామాలలో చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వీఆర్‌ఏలను నియమించారు. రెండు మూడు రోజుల నుంచి వందల ట్రాక్టర్లు మంజీరాలోకి రావడంతో వీఆర్‌ఏలు చెక్‌పోస్టు వద్ద అడ్డుకున్నారు. మా నెట్‌వర్క్ చాలా పెద్దది పైవారు అందరు మావారు ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపేస్తామని వీఆర్‌ఏలను బెదిరించారు. భయపడి పరుగు పరుగున బుధవారం తహసీల్ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్‌కు సమస్యలు వివరించారు. వెంటనే తహసీల్దార్ ఎస్సైకి సమాచారం అందించారు. సిబ్బంది కొరత ఉందని ఎస్సై వివరించినట్లు సమాచారం. పోలీసులు సహకారం అందిచడం లేదని తెలిసింది.

గతంలో వీఆర్‌ఏ ఆస్పత్రిపాలు..

శాంతాపూర్ మీదుగా అక్రమ ఇసుక ట్రాక్టర్లు వెళ్తున్నాయి.. అడ్డుకోవాలని అధికారులు వీఆర్‌ఏను ఫోన్ ద్వారా ఆదేశించడంతో ఆయన ట్రాక్టర్లను అడ్డుకున్నాడు. ఆగ్రహంతో ఉన్న ఇసుక మాఫియా సభ్యులు ట్రాక్టర్‌తో ఢీకొట్టి పారిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో ఆయనను వెంటనే నిజామాబాద్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. రెవెన్యూ అధికారులు శాంతాపూర్ ఘటనను గుర్తు చేస్తూ ఇసుకాసురులు అధికారులకు బెదిరిస్తున్నారు. ఒక్కో గ్రామంలో కనీసం వందకు పైనే ట్రాక్టర్లు ఉన్నాయి.. ఇసుక రవాణా చేసేవారు యూనియన్ ఏర్పాటు చేసుకొని బెదిరిస్తున్నట్లు తెలిసింది.

బెదిరించిన మాట నిజమే



ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లు రెవెన్యూ సిబ్బందిని చంపేస్తామని బెదిరించిన మాట నిజమేనని అన్నారు. ఈ విషయం బాన్సువాడ ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లి జిల్లా పోలీస్ అధికారులతో మాట్లాడి పోలీస్ సెక్యూరిటీ ఇవ్వాలని రాత పూర్వకంగా లెటర్ ఇచ్చాం

– సురేష్, తహసీల్దార్, బిచ్కుంద

అక్రమ సొమ్ము రికవరీ చేస్తాం

- ఉపాధి హామీ ఏపీడీ వామన్‌రావు
- బిచ్కుందలో సామాజిక తనిఖీ ప్రజావేదిక



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

బిచ్కుంద(జుక్కల్): ఉపాధి హామీ పథకానికి సంబంధించి సామాజిక తనిఖీలలో అక్రమాలకు పాల్పడినట్లు తేలితే వారి నుంచి సొమ్ము రికవరీ చేస్తామని ఏపీడీ వామన్‌రావు అన్నారు. బుధవారం మండల పరిషత్ ఆవరణలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023–24లో రూ.1,26,09,567 విలువైన పనులు జరిగాయని తెలిపారు. కొన్ని గ్రామాలలో పనులు చేయకుండానే చేసినట్లు రికార్డులలో నమోదు చేశారని వివరించారు. ప్రజా వేదికలో తయారు చేసిన నివేదికలు చదివి వినిపించారు. 27 జీపీలలో జరిగిన ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ అధికారులు రికార్డులు, క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఎంపీడీవో గోపాల్, సోషల్ ఆడిట్ అధికారి ప్రశాంత్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మించే బాధ్యత నాదే



ఎన్‌బురాలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

మద్నూర్(జుక్కల్): బీటీ రోడ్డు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్న ఎన్‌బురా గ్రామానికి త్వరలో రోడ్డు నిర్మించే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు హామీ ఇచ్చారు. డోంగ్లీ మండలంలోని ఎన్‌బురా గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ గ్రామానికి ఇంత వరకు బీటీ రోడ్డు లేదని, అలాగే రాచన్న ఆలయం వరకు నూతన రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం మొరం రోడ్డును వేయిస్తానని, త్వరలో బీటీ రోడ్డు నిర్మాణం చేసుకుందామని ఆయన అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాలన్నీ అభివృద్ధి చేస్తానని చెప్పారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన నేతలతో..

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

బిచ్కుంద(జుక్కల్): పుల్కల్‌లో బీఆర్‌ఎస్ మాజీ ఎంపీటీసీ పురుషోత్తం పటేల్, బీఆర్‌ఎస్ నేత కాంతారావు దేశాయి ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు, అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లోకి వస్తున్నారని అన్నారు. గత పాలకుల వల్ల గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మల్లికార్జునప్ప షెట్కార్, మాజీ ఎంపీటీసీలు సిద్ధిరాములు, మాజీ సర్పంచులు వెంకట్‌రెడ్డి, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బకాయిలను ఇప్పించేందుకు కృషి చేస్తా

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



షబ్బీర్ అలీతో సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు నర్సింలు యాదవ్

భిక్కనూరు: కామారెడ్డి జిల్లాలో తాజా మాజీ సర్పంచ్‌లకు ప్రభుత్వం నుంచి రావల్సిన బకాయిలను ఇప్పించేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. బుధవారం సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు నర్సింలు యాదవ్, ప్రతినిధి గుడిసె రాములు హైదరాబాద్‌కు వెళ్లి షబ్బీర్‌అలీని కల్సి జిల్లాలో తాజా మాజీ సర్పంచ్‌లకు రావల్సిన బకాయిల గురించి వివరించారు. స్పందించిన షబ్బీర్ అలీ..సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి నిధులు మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

కల్వర్టు మరమ్మతులను నాణ్యతతో చేపట్టాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట నుంచి చీనూర్‌కు వెళ్లే దారిలో పోచారం ప్రధానకాలువపై గల ఇరుకు కల్వర్టు మరమ్మతు పనులను నిబంధనల ప్రకారం, నాణ్యతతో చేపట్టాలని ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు సూచించారు. మరమ్మతు పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇరుకు కల్వర్టు వల్ల ప్రజలు ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని కల్వర్టును వెడల్పు చేయడంతోపాటు ఇరువైపులా సైడ్‌వాల్స్ నిర్మించే పనులు చేపట్టామన్నారు. ఇందుకోసం రూ.6 లక్షల 40వేల నిధులను కేటాయించినట్లు చెప్పారు. ఇరిగేషన ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్స్‌పెక్టర్ యాదగిరి తదితరులున్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

బాల్కొండ: చిట్టాపూర్‌లో గత నెల 19న పుంచెట్టి లింగన్న అనే వ్యక్తి ఇంటి తాళాన్ని పట్టపగలు పగులగొట్టి 8 తులాల బంగారం, నగదును ఎత్తుకెళ్లిన నిందితులను బాల్కొండ పోలీసులు బుధవారం ఆర్మూర్ పట్టణంలో అరెస్ట్ చేశారు. ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ఉమ్రి మండలం కార్ల గ్రామానికి చెందిన ముస్కర్ నాందేవ్ అలియాస్ జ్ఞానేశ్వర్, ఉమ్రికి చెంది న సబ్నెద్వాడ్ మహదేవ్ అలియాస్ శివ చోరీ కేసులో పట్టుబడ్డారన్నారు. నాందేవ్ గతంలో కూడా పలు చోట్ల చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. చిట్టాపూర్‌లో చోరీ చేసిన బంగారాన్ని ఆర్మూర్‌లో విక్రయిస్తున్నారనే సమాచారం అందడంతో అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆరు తులాల బంగారం రికవరీ చేశామ ని, మరో 2 తులాల బంగారం ఓ ప్రైవేట్ ఫై నా న్స్‌లో తాకట్టు పెట్టినట్లు తెలిసిందన్నారు. ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బాల్కొండ ఎస్సై అరాఫత్‌ను అభినందించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక సహాయం



నగదును ఎస్‌హెచ్‌వోకు అందజేస్తున్న వ్యాపారులు

కామారెడ్డి క్రైం: పట్టణ పోలీసుల సూచన మేరకు సిరిసిల్ల రోడ్ ప్రాంతంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు వ్యాపార సముదాయాల యజమానులు ముందుకొచ్చారు. కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటు కోసం మొదటి విడుతగా రూ.2 లక్షలు జమ చేసి బుధవారం పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. వారిని ఎస్‌హెచ్‌వో అభినందించారు. సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని, మరిన్ని కెమెరాలు ఏర్పాటు చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.

జాతీయ స్థాయి సమావేశాల్లో సమస్యల ప్రస్తావన



సమావేశాల్లో పాల్గొన్న వెంకట్‌రెడ్డి

కామారెడ్డి అర్బన్: రాష్ట్ర విభజనలో భాగంగా ఆంధ్ర ప్రదేశ్‌లో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను ఇక్కడికి తీసుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నందుకు తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేస్తోందని జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి అన్నారు. ఈనెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో టీఎన్‌జీవోస్ తరపున జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. సమావేశాల్లో ఉద్యోగుల సమస్యలను చర్చించినట్లు పేర్కొన్నారు.

భార్యభర్తలపై కేసు నమోదు

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్ గ్రామంలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి పాల్పడిన దంపతులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ బుధవారం తెలిపారు. ఫకీరాబాద్‌కు చెందిన స్పందన అనే విద్యార్థిని నాగేపూర్‌లో ఆర్టీసీ బస్సులో ఎక్కిందని పేర్కొన్నారు. తోపులాటలో భాగంగా డ్రైవర్ రెడ్యా దూషించాడని స్పందన తన తల్లితండ్రులకు చెప్పింది. దీంతో వారు తిరుగు ప్రయాణంలో డ్రైవర్‌పై దాడి చేశారు. దీంతో శ్రీనివాస్ దంపతులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ బస్టాండ్ ప్రాంతంలో తెనుగు పోచయ్య(68)అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. గున్కుల్ గ్రామానికి చెందిన పోచయ్య మంగళవారం మహమ్మద్ నగర్ గ్రామంలోని వారాంతపు సంతకు వచ్చారు. సంతకు వచ్చిన పోచయ్య రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల గాలించారు. అర్ధరాత్రి వరకు ఆచూకీ లభించకపోవడంతో ఇంటికి వెళ్లారు. బుధవారం సాయంత్రం మహమ్మద్ నగర్ బస్టాండ్ ప్రాంతంలోని కిరాణా దుకాణ సముదాయాల వెనుక పోచయ్య మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న ఎస్సై సుధాకర్ పంచనామా నిర్వహించారు. విచారణ చేపట్టారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ..

బాన్సువాడ రూరల్: కొయ్యగుట్ట సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతిగంటి పోశికళ (35)అనే మహిళ మృతి చెందినట్లు సీఐ కృష్ణ తెలిపారు. బాన్సువాడ నుంచి కొయ్యగుట్ట వైపు నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుందని, స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారన్నారు. భర్త సాయిలు పదేళ్ల క్రితం మృతి చెందడంతో గాంధారి మండలం గౌరారంలోని అక్క వద్ద నివాసం ఉండే పోశికళ ఆర్నెల్ల క్రితం గొడవపడి బాన్సువాడకు వచ్చి ఇక్కడే ఉంటోంది. తన చెల్లె మృతికి కారణమైన వాహనాన్ని గుర్తించి చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని సోదరి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు.

అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి..



కామారెడ్డి క్రైం: అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పట్టణంలోని పంచముఖి హనుమాన్ కాలనీ వద్ద ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటంతో స్థానికులు బుధవారం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని అతడిని ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి వయస్సు 55 నుంచి 60 ఏళ్లు ఉంటుందని, కొంత కాలంగా భిక్షాటన చేస్తున్నాడని స్థానికులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సమాచారం అందించాలని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి కోరారు.

కరెంట్ షాక్‌తో గేదె ..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): జనగాంలో బుధవారం కరెంట్ షాక్‌తో ఓ గేదె మృతి చెందింది. గ్రామంలోని అంబీర్ శ్యామ్‌రావుకు చెందిన గేదె మేత మేస్తూ ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంటు తీగ తగలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ రూ.1లక్ష ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు.

భయపడే ఆత్మహత్యాయత్నం

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బుధవారం ఎస్‌హెచ్‌వో మహేష్ మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన రమేష్, ముబారక్‌నగర్ చెందిన యువతి ఇంట్లోంచి పారిపోయి పెళ్లి చేసుకున్నారు. దీంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విచారణ చేపట్టగా, ఇరు కుటుంబాలు రమేష్‌పై కోపానికి రావడంతో భయభ్రాంతులకు గురై ఆత్మహత్యకు యత్నించినట్లు వివరించారు. రమేష్‌పై ఎటువంటి కేసు నమోదు చేయలేదని మహేష్ పేర్కొన్నారు.

యువకుడి జేబులో పేలిన మొబైల్



పిట్లం(జుక్కల్): ఓ యువకుడి ప్యాంట్ జేబులో మొబైల్ ఫోన్ ఒక్కసారిగా పేలిన ఘటన బుధవారం పిట్లంలో చోటు చేసుకుంది. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన ఎనిగే సాయిలు అనే యువకుడు తన మొబైల్ని ఎప్పటిలాగే తన ప్యాంట్ జేబులో పెట్టుకున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా మొబైల్ పేలింది. జేబులోంచి మొబైల్ తీసేలోపే మొబైల్‌కు మంటలు అంటుకొని జేబు కాలిపోయింది. ఈ ఘటనలో ఎనిగే సాయిలుకు గాయాలు కాకపోవడంతో ప్రమాదం తప్పింది.


వరకట్నం డిమాండ్.. పలువురిపై కేసు నమోదు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీనగర్ తండాకు చెందిన నటరాజ్, జున్ను, హరిలపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ బుధవారం తెలిపారు. వివరాలు.. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గడ్డం ప్రియాంకను బాలాజీనగర్ తండాకు చెందిన నటరాజ్ ప్రేమించి వివాహం చేసుకున్నాడు. పెళ్లి సమయంలో ఎలాంటి కట్నం ఇవ్వకపోవడంతో భర్త నటరాజ్, అత్త జున్ను, మామ హరిలు కట్నం కోసం వేధిస్తున్నారని ప్రియాంక ఫిర్యాదు చేయడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తాళంవేసిన ఇంట్లో చోరీ

బాన్సువాడ : పట్టణంలోని దాల్‌మల్‌గుట్టకు చెందిన సాయిరాం అనే వ్యక్తి ఇంట్లో మంగళవారం చోరీ జరిగింది. సాయిరాం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లి ఈనెల 13న తిరిగి వచ్చాడు. ఆయన ఇంటికి వేసిన తాళాన్ని పగులగొట్టిన దుండగులు సిలిండర్, బియ్యంను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణ తెలిపారు.

మానసిక స్థితి బాగాలేక ఆత్మహత్య



కొండ రాజు (ఫైల్)

బాన్సువాడ : మానసికస్థితి బాగాలేక పట్టణానికి చెందిన కొండ రాజు(55) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు. పట్టణంలోని గూడెంగల్లీకి చెందిన రాజు హెయిర్ సెలూన్ నడుపుకుంటూ జీవించేవాడని, మద్యానికి బానిసై ఇంటి నుంచి బయటికి వెళ్లిపోతూ తిరిగి వచ్చేవాడన్నారు. దుకాణానికి వెళ్తున్నానని బుధవారం ఇంట్లో నుంచి వెళ్లిన రాజు ఎల్లయ్య చెరువు కట్టపై చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మృతుడి భార్య కొండ సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉద్యోగం రావడం లేదని..



సాయి (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): ఉద్యోగం రావడం లేదనే మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మోర్తాడ్‌కు చెందిన భోగ సాయి(28) ఇంజినీరింగ్ పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం లండన్‌కు వెళ్లి వచ్చాడు. తాను కోరుకున్న ఉద్యోగం దక్కడం లేదని తీవ్రమనస్తాపానికి గురైన సాయి మంగళవారం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాండ్లపేట్ శివారులోని వాగులో సాయి మృతదేహం బుధవారం లభించింది. మృతుడి తండ్రి భోగ రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.